క్లుప్తంగా

విద్యాభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య

డెంకాడ: విద్యార్థుల విదాభివృద్ధికి తల్లిదండ్రులు కూడా తమ వంతుగా సహకరించాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతోమ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తాము కృషి చేస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు.

యువత క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలి



ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల రూరల్: యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎస్సై నారాయణరావు సూచించారు. మండలంలోని రామతీర్థంలో వారం రోజులుగా మిల్కాసింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ పోటీ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల్లో రాణించే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని.. నచ్చిన క్రీడలో ప్రావీణ్యం సంపాదించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మొదటి రెండు స్థానాల్లో నిలిచిన గొర్లిపేట, దన్నానపేట క్రికెట్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



యోగా పోటీలో విద్యార్థినులు

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జస్ట్ ఏ మినిట్, చదరంగం, థగ్ ఆఫ్ వార్, యోగాలోని వృక్షాసనం వంటి క్రీడలు నిర్వహించారు. అనంతరం విజేతకుల కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మొదటి సంవత్సర విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. సుమారు రూ.3 లక్షల నిధులతో లక్ష్మీదేవి పేటలో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణానికి వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వార్డు కౌన్సిలర్ పాండ్రంకి సత్యవతి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, కనకల హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

నెల్లిమర్ల రూరల్: మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెరపురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ స్వాతి సూచించారు. మండలంలోని బూరాడపేటలో మొక్కజొన్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగును గుర్తించి పలు సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కత్తెర పురుగు నివారణపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

సంగీత అకాడమీ ఏర్పాటు హర్షణీయం

విజయనగరం టౌన్: దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీ రెండో శాఖను కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఏర్పాటు చేయడం హర్షణీయమని సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ.శ్రీకాంత్ అన్నారు. అకాడమీ రెండో శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు శాస్త్రీయ సంగీతం, భక్తి సంగీతం, మృదంగం, వయోలిన్, కీబోర్డు తదితర గాత్ర, జంత్ర వాయిద్యాలతో పాటు హరికథలోనూ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి, డివిజన్ కార్పొరేటర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మాట్లాడండి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: పట్టణంలోని 25వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు మాట్లాడాలని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 25 వ డివిజన్ 62వ సచివాలయం ఉల్లివీధి ప్రాంతంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తోందన్నారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నగర అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుంటే ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. బంగ్లాలో కూర్చుని కల్లబొల్లి మాటలు మాట్లాడడం సరికాదని హితవు పలికారు. టీడీపీ నాయకులు గతంలో చేసిన తప్పులను ప్రజల ముందు ఒప్పుకోవాలన్నారు. పాత ఆర్డీఓ కార్యాలయం, జనతా బజార్, కేటిల్ డిపో వంటి ఖరీదైన స్థలాలను విక్రయించిన నాటి పెద్దలు ఆయా నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో, ఏం చేసారో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పాలనలో నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి కూడళ్లలో వాటర్ ఫౌంటెన్లు, విద్యుత్ కాంతలు ఏర్పాటు చేసి నగరానికి కొత్త అందాలను తీసుకొచ్చిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ యడ్ల రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

19వ డివిజన్‌లో ....

నగరంలోని 19వ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, తదితరులు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. దాల్ మిల్లు నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ పథకాల పట్ల సానుకూల స్పందనను వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పాట్నూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్ ప్రజలందరూ పాలనపై పూర్తి సంతృప్తితో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, మాజీ కౌన్సిలర్ పాట్నూరు పద్మ, పాట్నూరు వెంకటరావు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, తదితరులు



భోగాపురం: రామచంద్రపేటలో లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రజా ప్రతినిధులు

జగనన్నను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని రామచంద్రపేట, తోటపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అన్ని అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారి వివరాలు సేకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతివ్వాలని కోరారు. టీడీపీ హయంలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాడ్డాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని రాష్ట్రాలూ జగనన్న పాలన వైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాశ్, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, మత్స్యశాఖ డైరెక్టర్ ఎం నరసింహులు, దుక్క అప్పన్న, శ్రీను, సుందర హరీష్, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పల నారాయణ, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, అపురభుక్త పైడినాయుడు, కర్రోతు వెంకటరమణ, సుగ్గి రాము, పోతిరెండి గోపి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్



అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణాలకు ఇప్పటికే శంకుస్థాపనలు పూర్తయ్యాయని, నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జగనన్న కాలనీ లబిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయిల ఏర్పాటు..



అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

విజయనగరం: పట్టణంలోని వీటీ అగ్రహారానికి చెందిన మండవిల్లి వెంకటరాజు తమ తల్లిదండ్రులు కీ.శే పైడిశెట్టి, సుగుణవతి జ్ఞాపకార్థం ఐదు కుళాయిలు ఏర్పాటు చేసి వాటికి శుద్ధజల యంత్రాలు సమకూర్చారు. వీటిని స్థానిక 26వ వార్డు కార్పొరేటర్ బాలి పద్మావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో మంచినీటి ఎద్దడి లేకుండా తన సొంత ఖర్చులతో కుళాయిలు ఏర్పాటు చేసిన వెంకటరాజును అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు - 2023కు ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి బి. శాంతకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళలు, సాంఘిక కార్యక్రమాలు, సైన్స్, ఇంజినీరింగ్, వ్యాపారం, ఉపాధి, ఆరోగ్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, తదితర రంగాల్లో ప్రావీణ్యం పొందిన మహిళలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా అంశాలలో ఎవరైతే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన సేవలు అందిస్తున్నారో వారి సేవలు పరిగణలోనికి తీసుకోబడతాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. జిల్లా స్థాయి అవార్డులకు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌లకు కూడా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోగా అందివ్వాలన్నారు. హెచ్‌టీటీపీఎస్ అవార్డ్స్.జీవీఓ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోలగట్ల



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం రూరల్: సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్, మహేంద్ర ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రామనారాయణం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలతో పాటు పిల్లలకు ఆరోగ్య తనిఖీలు అవసరమనే విషయాన్ని గుర్తించి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజానికి మేలు చేయాలన్న దృక్పథంతో నారాయణం శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఎప్పటినుంచో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అలాగే ఎక్కడైనా ఆలయ నిర్మాణాలు చేపట్టినా విరివిగా విరాళాలు అందిస్తుంటారని గుర్తు చేశారు. సమాజహిత కార్యక్రమాలకు ఎమ్మెల్యేగా తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నారాయణం శ్రీనివాస్, డాక్టర్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహరాజా ఫార్మసీ కళాశాలలో ఈ నెల 4వ తేదీ నుంచి జరుగుతున్న 'మహిళా ఆత్మరక్షణ' అవగాహన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కళాశాల మహిళా సాధికార లింగ సున్నితత్వం కమిటీ సమన్వయకర్త కె.మాధవి, జిల్లా క్రీడా సాధికార సంస్థ కోచ్ ఎస్.రవి సంయుక్త పర్యవేక్షణలో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ, ఆత్మస్థైర్యాన్ని కలిగించే క్రీడలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం..



భోగాపురం: రావాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అచ్యుతకుమారి



విజయనగరం అర్బన్: డిగ్రీ కళాశాలలో అవగాహన కలిగిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ హెల్త్ సెక్రటరీ పి.వరలక్ష్మి



విజయనగరం రూరల్: దుప్పాడ పాఠశాలలో విద్యార్థులతో నులి పురుగుల నివారణ మందులు మింగిస్తున్న వైద్యాధికారి జగదీష్

ఆరోగ్యకర సమాజ స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తోంది. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో గురువారం జరిగిన డీ వార్మింగ్ డే కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షించారు.

– విజయనగరం/నెల్లిమర్ల

మరిన్ని పతకాలు సాధించాలి

- రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల



క్రీడాకారులను అభినందిస్తున్న రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు

నెల్లిమర్ల రూరల్: మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు ఆకాంక్షించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన వెయిట్‌లిఫ్టర్లు గురువారం అంబళ్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెయిట్‌లిఫ్టర్లు శనపతి పల్లవి, బెల్లాన హారిక, గురునాయుడులను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు కొండవెలగాడ పుట్టినిల్లుగా మారిందని.. ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో కోచ్ చల్లా రాము, నాయకుడు గురునాథరావు పాల్గొన్నారు.

పల్లవికి సత్కారం

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని, ఏషియన్, కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ విజేత ఎస్.పల్లవి, కోచ్ చల్లా రామును గురువారం కళాశాల ప్రాంగణంలో యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే క్రీడా లక్ష్యాలను సాధించగలరన్నారు. అంకితభావంతో శిక్షణ పొందితే ఎన్నో పతకాలు సాధించవచ్చని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెట్విజ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ జిల్లా ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రామగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి, ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామునిపేటలో 'నాభూమి - నా దేశం'



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ గిరిబాల, తదితరులు



డెంకాడ: ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట ప్రాథమిక పాఠశాలలో నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాల మాట్లాడుతూ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహానీయులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. యువత త్యాగవీరులను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రాంబార్కి రామారావు, బూర్లె సత్యం, ఏపీఓ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పినతాడివాడలో..

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో నా దేశం - నా భూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఏపీఓ వెంకటరమణ, పలు శాఖల అధికారులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఈ సంజీవిని'ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



ఈ–సంజీవిని వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

డెంకాడ: ఈ–సంజీవిని విధానంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు కోరారు. మండలంలోని పినతాడివాడలో వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగుల సమస్యలను తెలుసుకుని వాటికి ఈ–సంజీవిని ద్వారా చికిత్సలు పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవాలపై ఆరా తీశారు. అలాగే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుష్మసాయి, సీహెచ్ఓ ఏసయ్య, ఉపాధ్యాయులు, వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ



పూసపాటిరేగ: కొప్పెర్ల సర్పంచ్ ఉప ఎన్నికలలో నామినేషన్ వేసున్న పైడి పార్వతమ్మ



పూసపాటిరేగ: నామినేషన్ దాఖలు చేస్తున్న, సత్తిబాబు



డెంకాడ: నామినేషన్లు వేసిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను పబ్లిష్ చేస్తున్న ఆర్ఓ రామకృష్ణ

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల సర్పంచ్ ఉప ఎన్నికకు గురువారం ఏడు నామినేషన్లు అందినట్లు రిటర్నింగ్ అధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో పైడి పార్వతమ్మ, పైడి విజయలక్ష్మి, లంకలపల్లి కల్యాణి, శంకాబత్తుల సత్తిబాబు, శంకాబత్తుల పద్మావతి, బావిశెట్టి నారాయణరావు, బావిశెట్టి వినోద్ ఉన్నారని తెలిపారు. ఇదిలా ఉంటే టీడీపీ మద్దతుతో బరిలో ఉన్న ఆకిరి జగదీశ్వరరావు పోటీ నుంచి తప్పుకున్నారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ మద్దతుదారు పైడి పార్వతమ్మకు మద్దతు తెలియజేసినట్లు జగదీశ్వరరావు, టీడీపీ నాయకులు ఆకిరి ప్రసాదరావు, తదితరులు తెలిపారు.

మూడు నామినేషన్లు..

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస 7వ వార్డు మెంబర్ ఎన్నిక కోసం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. ఎన్నికల ఆర్ఓ రామకృష్ణ నామినేషన్లను పరిశీలించారని చెప్పారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- దళిత ఆదివాసీ క్రైస్తవ మైనారిటీ ప్రజా సంఘాల డిమాండ్



దళిత ఆదివాసి మైనారిటీ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

విజయనగరం టౌన్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫెడరేషన్, వివిధ దళిత ఆదివాసీ మైనారిటీ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దళిత క్రైస్తవులపై వివక్షత చూపడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎస్సీ, ఎస్టీ డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యులు బుంగ భానుమూర్తి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ కల్పిస్తున్నప్పటికీ భారతదేశంలో దళిత క్రైస్తవులు తీవ్రమైన ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్నారన్నారు. అనంతరం డీఆర్ఓ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం. ఏసురత్నం, అలజంగి రవికుమార్, ఎ.కరీమ్, గంట డేవిడ్, గులిపల్లి రాజు, హసీనా బేగం, ఎన్. వరప్రసాద్, ఎస్. కాశీబాబు, కె. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు సెర్ప్ ఉద్యోగులు



సెర్ప్ ఉద్యోగుల బస్సుకు జెండా ఊపుతున్న జెడ్పీ చైర్మన్

విజయనగరం: అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగులు ఏ సమస్యను తెలియజేసినా సానుకూల నిర్ణయం తీసుకుంటారని కొనియాడారు. 23 శాతం ఫిట్ మెంట్ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు జిల్లా నుంచి సెర్ప్ ఉద్యోగులు అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు గురువారం బయలుదేరి వెళ్లారు. అమలాపురంలో శుక్రవారం జరిగే సున్నా వడ్డీ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని వీరంతా ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతారు. వీరు వెళ్తున్న బస్సును జెడ్పీ చైర్మన్ గురువారం రాత్రి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.